డీసీపీ అక్రమాలపై ఆరా

- వివరాలు పంపించాలంటూ కమిషనర్‌కు టౌన్‌ప్లానింగ్ డైరెక్టరేట్ లేఖ
- సెలవులో డీసీపీ సంధ్యారాణి
- ఒక అధికారిణి, ప్లానింగ్ కార్యదర్శిపై వేటుకు రంగం సిద్ధం



కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేస్తూ ఇటీవలే కుడా ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇటీవల ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు, భవన నిర్మాణాల అనుమతుల్లో ప్లానింగ్ కార్యదర్శి రఫీక్ బాషాతో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం డీసీపీ, ప్లానింగ్ కార్యదర్శి అవినీతికి సంబంధించి విచారణ ప్రారంభించింది. ఇప్పటికే ప్రభుత్వం నియమించిన కమిటీలో ఉన్న పి.నరసింహప్రసాద్ (చిత్తూరు మున్సిపల్ కమిషనర్), వి.దివాకర్ రెడ్డి (రాయదుర్గం మున్సిపల్ కమిషనర్), మహాపాత్రో (చిత్తూరు డిప్యూటీ సిటీ ప్లానర్), ఓంకార్ (అనంతపురం డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం) ఈనెల 12 నుంచి రెండు రోజుల పాటు కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ సిటీ ప్లానర్‌తో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారులు, నగరపాలక కమిషనర్, లైసెన్స్‌డ్ ఇంజినీర్ల అసోసియేషన్‌లతో నేరుగా మాట్లాడారు. వీరిరువురిపై విచారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

వివరాలు పంపించాలంటూ కమిషనర్‌కు లేఖ

రెండు రోజుల క్రితం అనంతపురం టౌన్ ప్లానింగ్ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయం నుంచి నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబుకు లేఖ రాశారు. అందులో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చేసిన అక్రమాలకు సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలు కావాలని ఆ లేఖలో కోరారు. డీసీపీగా సంధ్యారాణి పనిచేసిన హయంలో ఎన్ని ప్లాన్లు మంజూరు చేశారు? సంబంధిత దరఖాస్తుల వివరాలు, క్లియర్ చేసిన భవన నిర్మాణ దరఖాస్తులు, షార్ట్‌ఫాల్ చేసిన దరఖాస్తులు, ఇందుకు సంబంధించి మాస్టర్ డేటా వివరాలు, ఖాళీ స్థల పన్నుల విషయంలో 14 శాతం, 33 శాతం ఫీజులను ఎన్నింటికి వసూలు చేశారు. ఎల్‌టీపీ లాగిన్ వివరాలు, యాక్షన్ టోకెన్ రిపోర్టు వంటి వివరాలను తెలియజేయాలని కమిషనర్‌కు లేఖ రాశారు.

సస్పెన్షన్ వేటు

టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల అక్రమాలపై సీరియస్‌గా ఉన్న ప్రభుత్వం వారిపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఒక అధికారిణితో పాటు ప్లానింగ్ కార్యదర్శి పెద్ద ఎత్తున అక్రమాలు చేసి రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణల నేపథ్యంలో వీరిరువురిపై సస్పెన్షన్ వేటు వేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ అధికారిణి కర్నూలు నగర పాలక సంస్థ నుంచి 'కుడా'కు బదిలీఅయ్యింది. తాజాగా కార్యాలయానికి రావడం లేదు. సెలవులో ఉన్నట్లు సమాచారం.

అదనపు ఫ్లోర్ల అనుమతుల్లో అక్రమాలు

కర్నూలు నగరంలోని మద్దూరునగర్, కృష్ణానగర్, కల్లూరు, పాతబస్టాండ్, ప్రకాష్ నగర్ తదితర వాణిజ్య ప్రాంతాల్లో పార్కింగ్ లేకుండా అనుమతులు, డీవియేషన్స్ ఉన్నా రూ.2 లక్షలు తీసుకొని పట్టించుకోకపోవడం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయ సమీపంలో ఎలాంటి పార్కింగ్ సౌకర్యం లేకున్నా.. మూడు ఫ్లోర్లలో అనుమతులు ఇవ్వడం వంటి అనేక అక్రమాలు జరిగాయి. ఫిర్యాదులు వచ్చిన డీసీపీ స్థాయి హోదాల్లో పట్టించుకోకపోవడం, ప్లానింగ్ కార్యదర్శి మొత్తం వ్యవహారం నడిపినట్లు వెలుగులోకి వచ్చింది.

క్లుప్తంగా

మహిళల హక్కులను పరిరక్షించాలి

కర్నూలు కల్చరల్: మహిళలపై హింస వారి హక్కులను ఉల్లంఘించడమేనని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నైస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో మహిళల హక్కులు – చట్టాలు అనే అంశంపై మంగళవారం నైస్ కంప్యూటర్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ వివక్ష లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళల హక్కులు చట్టాలకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. పలు విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీలో రాజ్యాంగ దినోత్సవం

కర్నూలు(అర్బన్): ఈ నెల 26వ తేదిన ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరు పదిహేను నిమిషాల ముందుగానే జెడ్పీలోని మినీ సమావేశ భవనానికి చేరుకోవాలని ఆయన కోరారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: ఉత్పన్న ఏకాదశిని పురస్కరించుకొని గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచారధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం ఉంటుందని సంఘం అధ్యక్షులు డీవీ రమణ తెలిపారు. ప్రవచనకర్త విశ్వనాథ్ ప్రవచనం చెబుతారని పేర్కొన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్య



మృతిచెందిన మతిస్థిమితం లేని వ్యక్తి

కర్నూలు: స్థానిక సిల్వర్‌జూబ్లీ కాలేజీ సమీపంలోని ఖానా ఖజానా బ్రిడ్జి పైనుంచి మతిస్థిమితం లేని వ్యక్తి కిందకు దూకి మృతి చెందాడు. ఇతను స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. సోమవా రం సాయంత్రం రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తూ ఖానా ఖజానా వద్ద బ్రిడ్జి పైనుంచి దూకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మూడో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని ఘటనకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడి వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐయూటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్కూలు ఆయాలు, కుకింగ్ హెల్పర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐయూటీయూసీ జిల్లా కార్యదర్శి తేజోవతి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట స్కూలు ఆయాలు, కుకింగ్ హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయాలు, కుకింగ్ హెల్పర్లకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఆయాలకు రూ.15 వేలు, హెల్పర్లకు రూ.10 వేలు వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకుడు నాగన్న పాల్గొన్నారు.

వడ్డెరలు ఐక్యతతో మెలగాలి

కర్నూలు న్యూసిటీ: వడ్డెరలు అన్నిరంగాలలో అభివృద్ధి చెందేందుకు ఐక్యంగా పోరాడాలని ఆ సంఘం నాయకులు వెంకటయ్య, మాజీ కౌన్సిలర్ వెంకటస్వామి, బత్తుల సంజీవరావు సూచించారు. సోమవారం వడ్డెర కమ్యూనిటీ హాల్ వద్ద వడ్డెరల కార్తీక వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి, శివస్వామి మాలధారులకు భిక్షా కార్యక్రమం చేపట్టారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.250 కోట్లు కేటాయించాలని కోరారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. సంఘం పెద్దలు బత్తుల లక్ష్మికాంతం, గోగుల అయ్యన్న, శ్రీనివాసులు, భారీఎత్తున మహిళలు పాల్గొన్నారు.



లలితా పీఠంలో మహా శివుడు



సూర్య నారాయణ స్వామి ఆలయంలో గౌరీ శంకరుడు



సాయిూశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



తాండ్రపాడులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఘనంగా కార్తీక పూజలు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని కర్నూలు నగరంలోని శివాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో కార్తీక స్నానాలను ఆచరించి ఆలయాలను సందర్శించి కార్తీక దీపాలను వెలిగించి దీప దర్శనం చేసుకున్నారు. నగరంలోని ఇస్కాన్, చిన్మయ మిషన్, సప్తగిరి కైలాసగిరి ఆలయం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, నెహ్రూనగర్ సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామ్‌నగర్, బుధవార పేట, మాధవనగర్ శివాలయాలు, వైద్య కళాశాల మైదానం నీలకంఠ స్వామి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వర స్వామి ఆలయం, లలితా పీఠం, నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగౌరీ శంకర ఆలయం, అరోరానగర్‌లోని రాజరాజేశ్వరి ఆలయం, రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయం, జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



లలితా పీఠంలో రాఘవేంద్ర స్వామి రూపంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ మెన్స్ హాస్టల్‌లో వైద్య విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం పూర్తిగా చెడిపోవడమే గాక బంధువులకు, కుటుంబ సభ్యులకు దూరమవుతారని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ విజయ్ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ఎంసీపీ కార్డు

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం ఎంసీపీ కార్డును రూపొందించారని డెమో శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్హీన్ తబస్సుమ్ చెప్పారు. సోమవారం నగరంలోని శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఎంసీపీ కార్డుపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించాల్సిన టీకాలతో కూడిన విలువైన సమాచారంతో ఎంసీపీ కార్డు ఉంటుందన్నారు. కార్డులో నమోదు చేసిన సమాచారం ఆధారంగా గర్భిణులకు సురక్షిత ప్రసవం అయ్యేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు కళ్యాణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక నగరపాలకలోని ఆయన చాంబర్‌లో సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఓ జునీద్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే..

- ➡ ఉల్చాల రహదారిలోని వంశీ హోమ్స్‌లో తాగునీటి పైపులైన్ లేదని స్థానికులు శ్రీదేవి, సీతారామయ్య, కొండయ్య వినతిపత్రం అందజేశారు.
- ➡ చాంద్ టాకీస్ సమీపంలోని స్కంద కాంప్లెక్స్ వెనుక భాగంలో పరిసర ప్రజలు చెత్త వేస్తున్నారని స్థానికుడు బి.రంగస్వామి ఫిర్యాదు చేశారు.
- ➡ చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని బృందావన్ కాలనీ, 39వ వార్డు మమతనగర్‌లో సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీ కాల్వలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సంపత్‌కుమార్, జగదీష్, నాగేశ్వర్ విన్నవించారు.
- ➡ జొహరాపురం డంప్ యార్డు వద్ద ఉన్న మణికంఠ హోమ్స్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసి టీ.వీ.రామకృష్ణయ్య ఫిర్యాదు చేశారు.

క్రీడాకారులకు జేసీ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): నవంబర్ 16 నుంచి 18వ తేదీ వరకు గుడివాడలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ –19 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరచారు. 76 కేజీల విభాగంలో ఎం.పుష్పాంజలి స్వర్ణం, 102 కేజీల విభాగంలో బి.నవీన్ స్వర్ణం, 87 కేజీల విభాగంలో ఎస్.లోహిత కాంస్యం, 102 కేజీల విభాగంలో బి.శేషు కాంస్య పథకాలను సాధించారు. వీరంతా డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగే 68వ జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఈనెల 23, 24 తేదీల్లో రేణిగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 జూడో పోటీల్లో 73 కేజీల విభాగంలో ఇర్ ఇసాక్ వెండి, 90 కేజీల విభాగంలో బి.శేషు కాంస్య పథకాలను సాధించారు. పథకాలు సాధించిన క్రీడాకారులను సునయన ఆడిటోరియంలో జేసీ డాక్టర్ బి.నవ్య అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. డీఎస్‌డీఓ భూపతి, డీవీఈఓ పరమేశ్వరరెడ్డి, క్రీడల కోచ్‌లు యూసూఫ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక

కర్నూలు (టౌన్): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్.ఏ.పి క్యాంపులో నూతన రహదారి నిర్మించనున్న ప్రదేశాన్ని మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. బళ్లారి చౌరస్తా కూడలిలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను కొత్త బస్టాండ్ సమీపంలోకి చేరుకునేలా ఎస్‌ఏపీ క్యాంపు మీదుగా కొత్త రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 40 అడుగుల వెడల్పు, 116 మీటర్ల పొడవుతో రహదారికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే కిడ్స్ వరల్డ్ సర్కిల్ నుంచి ఉస్మానియా కళాశాల, బుధవారపేట మీదుగా కలెక్టరేట్ వరకు, అలాగే అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర మఠం వరకు రహదారులను విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, డీఎస్పీ మహబూబ్‌బాషా, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల స్థలం కేటాయించలేదు

కర్నూలు (హాస్పిటల్): మెడికల్ కాలేజీ స్థలం ఇతర సంస్థలకు కేటాయించే పరిస్థితి లేదని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కాలేజీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించామని, అందులో సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారని, రాబోయే కాలంలో కళాశాల అభివృద్ధికి స్థలం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతలకు అభినందన

కర్నూలు (టౌన్): ఈనెల 24వ తేదీ విజయవాడలో నిర్వహించిన స్పైక్స్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అభినందనలు తెలియజేశారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో 24 పతకాలు సాధించిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఆర్భాటంగా కుడా చైర్మన్ ప్రమాణ స్వీకారం

కర్నూలు (టౌన్): కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. నగర శివారులోని సుంకేసుల రోడ్డులో ఉన్న ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాలు లో ఈ కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మంత్రులు ఫరూక్, టీజీ భరత్, ఎంఎల్‌సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జయనాగేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.

ఓటరు శిబిరాలను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో ఈనెల 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నగరంలోని పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, ఆర్‌ఎస్ రోడ్డు కూడలి, కలెక్టరేట్ తదితర ప్రాంతాల్లో ప్రచారంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు.

నేడు రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లాలోని అన్ని అమృత్ సరోవర్ చెరువుల వద్ద మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య ఉపాధి అధికారులను ఆదేశించారు. నవంబర్ 26న పార్లమెంటు రాజ్యాంగాన్ని ఆమోదించినందున ఆ రోజున ప్రతి ఏటా రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజ్యాంగ విలువలపై ప్రజలకు సమగ్రంగా అవగాహన ఏర్పడే విధంగా జిల్లాలోని 84 అమృత్ సరోవర్ల దగ్గర రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలని ఏపీడీలు, ఏపీఓ తదితర ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. గ్రామ పెద్దలు, విద్యార్థులు, యువజన సంఘాలను సమన్వయం చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్‌పీజీ చర్చిలో సపోజ్ క్రిస్‌మస్

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని పార్కు రోడ్డులో ఉన్న ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చ్‌లో సపోజ్ క్రిస్‌మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. మరో నెల రోజుల్లో క్రిస్మస్‌పండుగ రానున్న నేపథ్యంలో క్రైస్తవులు సపోజ్ క్రిస్మస్ వేడుకలను చేపడతారు. అందులో భాగంగా సోమవారం ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు పుట్టుకపై పిల్లలకు వివరించారు. శాంటాక్లాజ్ కేకులు, చాక్లెట్లు పంచి అబ్బురపరచారు. అనంతరం క్యాంపు ఫైర్‌లో భాగంగా చలిమంట వేశారు. చర్చి కమిటీ సెక్రటరీ పెర్సీ ఇమ్మానుయేల్, జాన్‌చందర్, క్రాంతి, రాజారావు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగర శివారులోని వెంకయపల్లె బీడీ కార్మికుల ఇళ్ల స్థలాలకు ఒరిజినల్ పట్టాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బీడీ కార్మికులకు ఇచ్చిన స్థలాలు కబ్జాకు గురి కాకుండా చూడాలని కోరారు. ప్రస్తుతం ఇళ్ల స్థలాలు పొందిన వారి దగ్గర ఒరిజినల్ పట్టాలు లేవన్నారు. దీంతో ఎవరికీ వారు దొంగ పట్టాలు పుట్టించుకొని తమదే అంటూ ఖాళీ స్థలాను కబ్జా చేస్తున్నారని వివరించారు. లబ్ధిదారులకు ఒరిజినల్ పట్టాలు ఇస్తే అక్రమార్కులను గుర్తించేందుకు వీలుంటుందన్నారు. నాయకులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, మహ్మద్, ఎండీ ఫరూక్ అహ్మద్, హఫీజ్, సయిద్‌బాషా పాల్గొన్నారు.